# ఒక చెల్లని రాత్రి

యామినీ సరస్వతి

"హలో! హలో! హలో !!"

మౌత్‌పీస్ పట్టుకున్న రజిత అలాగే ఆ పిలుపు వింటూ వుండి పోయింది. ఆ పిలుపు ఆమె చెవుల్లో ఝుమ్మ్మారు ప్రతిధ్వనించింది

"హలో రజితా!"

పలకాలనిపించ లేదామెకి.

"హలో ఎవరండీ ఆవైపు! రజితని పిలవండి! నేను జితేంద్రని!"

"నేను.... నేను... "

అస్పష్టంగా పలికింది రజిత గొంతు.

"హలో రజీ! పిలుస్తున్నా పలకవేం! నిన్ను పిలచినంత సేపు ఆ దేవుడిని పిలిచినా పలికేవాడే!"

"..................."

"హలో జితా!"

"అవును నేను జితనే! నీ చేత జయింపబడ్డాను. కనుక క్షమించు నేను రాలేను...."

"ఆగు. రజీ! ఫోన్ పెట్టెయ్యొద్దు..ఒన్ మినిట్ ప్లీజ్.......ఈ రోజు మేనకాలో డీలక్స్ టికెట్స్ బుక్ చేశాను. మంచి ఇంగ్లీష్ పిక్చర్...."

"స్టాపిట్ ఇంద్రా! ఇంగ్లీష్ పిక్చర్స్, మళయాళం పిక్చర్స్ నేను చూడ దలచుకోలేదు!"

"ఏమైంది? ఏమైంది రజితా నీకు? ఆర్ యు హర్ట్? నేనేం చేశాను, ఈ దాసుడి తప్పేదైనా వుంటే మనసారా మన్నించు. లేకపోతే జడతో కొట్టు-కట్టు. లేదా కాలిలో అట్టి పెట్టు-ఒట్టు పెట్టు-అంతే కానీ నాతో కలవకుండా నాతో మాటాడకుండా నాతో ప్రోగ్రాంకి రాకుండా బాధ పెడితే ఈ రజితేశ్వరుడు భరించలేడు. ఈ వియోగంతో చచ్చిపోతాడు....

అఫ్‌కోర్స్-చచ్చిపోతే సలీం, మజ్నూ దేవదాసుల్లిస్టులో చేరిపోతానుకో-నాకేం బాధలేదు-తనువు శాశ్వతం కాదు. కానీ ప్రియే! చారుశీలే! నీ నుండి దూరం కావటమే దారుణం...."

"జిన్! యిలాటి మాటల మత్తులో పడేసే కాలేజి మొత్తం మీద ఆటంబాంబనిపించుకున్న నన్ను ఫ్రెండ్‌ని చేసుకున్నావ్!......."

"థాంక్స్! థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్...."

"చారుశీలే అన్నావు కదూ! అదో అందుకే నేను నీకు దూరంగా వుండాలనుకుటున్నాను"

"దూరమా?"

"అవుము వినిపించనంతదూరం-కనిపించనంత నేను స్టేట్సుకి వెళ్ళి పోతున్నాను.... తెలుసా?"

"ఈజిట్? నిజమా! రజీ! నిజం చెప్పు-ఎందకీ దబాయింపు? నేనేం తప్పు చేశానని నాకీ శిక్ష? నీకంత ఫారిన్ వెళ్లాలనుంటే చెప్పు నెల తిరక్కుండా మిస్టర్ ఎండ్

మిసెస్ జితేంద్రలకి, ఫారిన్ టూర్ ఏర్పాటు చేస్తాను!"

"...........".

"హల్లో! పలకవేం రజీ!"

"మైడియర్ ఫ్రెండ్! కారిడార్‌లో మా నాన్నగారి పదధ్వని వినిపిస్తుంది. ఫోన్ పెట్టెయ్!"

"ఒకే! ఇదో ఓ ముద్దు పడేస్తున్నా! సాయంకాలం-ఆరింటికి-మేనక-ఇంగ్లీష్ పిక్చర్ మరవద్దు....... ప్చ్........"

"ప్చ్.." అప్రయత్నంగా ప్రతిధ్వనించింది రజిత

"థాంక్స్!"

అవతల క్రెడిల్ చేసిన శబ్దం విని ఒరుపుగా నిట్టూర్చి ఫోన్ పెట్టేసింది రజిత.

మరో ఆయిదునిమిషాలకి కోటీశ్వరరావు వచ్చేశాడు అక్కడికి. సోఫా సెట్‌లో కూర్చుంటూ, "ఎక్కడిన్నించమ్మా ఫోన్?!" అన్నాడు.

"నా గర్ల్ ఫ్రెండ్ నాన్నా"!

"ఇక యీ గర్ల్ ఫ్రెండ్స్‌నీ బాయ్ ఫ్రెండ్స్‌నీ కాస్త దూరంగా వుంచాలమ్మా?"

"ఎందుకు నాన్నా?"

"మీ బావ వచ్చే వారం వస్తున్నాడమ్మా! బోంబేకి వెళ్ళి రిసీవ్ చేసుకుని రావాలి. అతను రాగానే రిసెప్షన్. అది కాగానే మీ పెళ్ళి అంతే!"

రజిత గుండె గొంతులోకి వచ్చినట్లయింది.

"నాన్నా!" అంది తడబాటుతో.

"అదంతే నమ్మా! మీ అమ్మ చనిపోతూ నాతో మాట తీసుకుంది. ఈ పెళ్ళి జరిగితీరుతుందని మాటిచ్చాను. అంచేత అతనొచ్చేదాకా ఎలా తిరిగినా—అతనొచ్చాక అతనితోనే తిరగాలి. అంతే!"

"అమెరికా నుంచి వస్తున్నా బావలో మార్పురాదా నాన్నా! ఫ్రెండ్‌షిప్‌ని గౌరవించలేడా?"

"అమెరికా నుంచి వస్తున్నా-ఆస్ట్రేలియా నుంచి వస్తున్నా—లండన్ నుంచి నేరుగా దిగినా మగాళ్ళ మనస్తత్వమంతే నమ్మా! అమెరికాలో చదివి ఉద్యోగం చేస్తున్నా పుట్టింది యిక్కడేగా! కాబట్టి అంతేనమ్మా!"

రజిత జవాబివ్వలేదు.

"నువ్వయినా యిక ఫ్రెండ్‌షిప్ తగ్గించు. ఏదో యిక్కడ వుండి కాలేజీలో చదువుతున్నావు కాబట్టి కంపెనీకి ఫ్రెండ్స్ అవసరం—ఎలాగూ నెల నాళ్ళలో స్టేట్స్‌కి వెళ్ళబోయేదానికి యీ ఫ్రెండ్స్ ఎందుకమ్మా-ఇదంతా చెత్త. వీలయితే నెలకో రెన్నెల్లకో అమెరికాకి కేబుల్ కొట్టగల ఫ్రెండ్స్‌ని సంపాదించుకో-అది గౌరవం!"

నిట్టూర్చింది రజిత, "ఈ దేశమే కాదు-ఏ దేశమేగిన ఆడదానికి నిర్బంధాలు తప్పట్లేవు-పెళ్ళి కాకపోతే బ్రహ్మాండం పగిలి పోతుందనేట్టుగా భయపడతారు అంతా! పెళ్ళయితే ఒట్టి బానిసత్వం! ఆంధ్రాలో పశువుల కాసే వాడయినా, అమెరికాలో రిసెర్చి చేసే డాక్టరయినా ఒకటే-మనస్తత్వం!" అనుకుంది.

"అంచేత రజితా! బి ఏ గుడ్ గర్ల్!" అని సోఫాలోంచి లేచాడు రావు. సోఫా తగ్గిన బరువుకి బరువుగా మూల్గింది.

ం ం ం ం

సాయంకాలం అయిదు యాభై!

ఇంపాలా కారుకి ఆనుకుని అరగంట నుంచి అసహనంగా ఎదురు చూస్తున్నాడు జితేంద్ర. సరిగ్గా ఆరు గంటలకే రమ్మన్నా ఆడవాళ్ళ మనస్తత్వం బాగా తెలిసినవాడు కాబట్టి ఒక వేళ అయిదున్నరకే వస్తుందేమోనని అంత కంటె ముందుగానే వచ్చాడతను.

అతని మనస్సులో ఏవేవో ఆలోచనలు.

ఎన్నెన్నో ఊహలు!

"హాయ్!"

ఆ పిలుపుకి ఉలికి పడ్డాడు జితేంద్ర

ఎదురుగా నవ్వుతూ సరిత!

"పిక్చర్ కా"?

"ఊహూఁ" అన్నా డప్రయత్నంగా.



"బావుంది. నా ప్రశ్న తలతిరుగుడుగా వుంది. నీ జవాబు తల తిక్కగా వుంది. థియేటర్ ముందు నుంచుంటే సినిమాకి కాదని ఎలా అనుకుంటాను. కమాన్ వెళదాం పద! మంచి కంపెనీ!" అంది తమాషాగా చిన్నగా నవ్వుతూ.

"సారీ! సినిమాకి కాదన్నానా? ఎదురు షాపుకి పర్చేజింగ్‌కి ఓ ఫ్రెండ్ వస్తుంది. అందుకే యీ వెయిటింగ్!"

"ఎవరా ఫ్రెండ్? రజితేనా?"

జవాబివ్వలేదు జితేంద్ర.

"జిన్! మత్తెక్కించే నీ మాటలు వింటూ మత్తు వెదజల్లే నీ కళ్ళల్లోకి చూస్తూ నా బతుకులో ఎన్నో రోజులు గడిపాను. నాతో కిరికెనన్నాళ్ళూ నేనే లోకం అన్నావు-నన్నే పెళ్ళి చేసుకుంటానన్నావు, చివరికి నీ యాక్సిడెంటుతో నేను హాస్పిటల్లో మూడు నెల్లు రెస్టు తీసుకుని వచ్చేసరికి నువ్వు అప్పుడే కాలేజీలో అడుగు పెట్టినట్టుగా రజిత వెంట పడ్డావు. ఇది అన్యాయం!"

"షటప్!"

"జిన్!" దీనంగా పిలిచింది సరిత.

"ఇదిగో టికెట్స్! ఇదిగో వంద! ఇప్పటికి నన్ను వదిలేయ్!"

"అదా విషయం! ఇంతేనా నన్ను అర్థం చేసుకుంది నువ్వు, సారీ! నాకేం అక్కర్లేదు. ఆ మాట కొస్తే నువ్వు మాటకు కట్టుబడి నన్ను పెళ్ళి చేసుకోనక్కర్లే. నీ యిష్టం రజితనే చేసుకుంటావో స్వర్ణనే చేసుకుంటావో! నే నెందుకు అడ్డు పడాలి. కానీ నన్ను నీ గర్ల్ ఫ్రెండ్‌గా జీవితాంతం గుర్తిస్తే చాలు. ఇలాగే మేరేజ్ లేకుండా వుండిపోతాను".

"బోర్! పూర్ సరితా! నీ చాప్టర్ అయిపోయింది. వెళ్ళు!" అని కారెక్కి స్టార్టు చేసి ముందుకి దూకి చాడు.

పళ్ళు కొరుకుతూ నిలుచుండి పోయింది. సరిత! "డామిట్! చూస్తా ఎన్నాళ్ళిలా సాగుతుందో! రేపు రజిత నాన్నకి నీ గురించి ఫోన్ చేస్తే సరి! కిళ్ళు విరిపిస్తాడు-మంచ మెక్కితే మనం గుర్తుకొస్తాం దొరగారికి!"

o o o o

రజిత యింటి నుంచి మేనక థియేటర్‌కి వచ్చే దారిలో కారు నాపుకుని వుండిపోయాడు జితేంద్ర.

అప్పుడు సరిగ్గా ఆరూ పది హేను!

సినిమా ఎలాగూ తప్పి పోయింది. మరో పది నిమిషాల్లో రజిత వచ్చేసింది. ఏం చెప్పాలి? ఎక్కడికి తీసికెళ్ళాలి. అసలు తన ప్లాను వేరు. ఈ 'హాట్' పిక్చర్ చూపించి, వేడెక్కిన రజితని తమ గెస్ట్ హౌస్‌కి తీసికెళ్ళాలను కున్నాడు సరిత వచ్చి అంతా అప్సెట్ చేసింది

రజిత వస్తుందా?

రాక పోతే!

తిరిగి థియేటర్ కి వెళ్ళి సరితను కాల్ చేస్తే!

ఉహుం ఇక సరితని మరిచిపోవాలి.

ఆ అమ్మాయి లాభం లేదు. పిల్లది పిచ్చిదై పోయింది. చాలా డేంజరస్ అమ్మాయి, ఈ సారి ఆమె జోలికి వెళితే వాళ్ళ నాన్నా తమ్ముళ్ళు కలసి బలవంతంగా తనతో తాళి కట్టిస్తారు.

మైగాడ్! సరితని భార్యగా భరించగలడా?

"ఊహుం"

ఉలిక్కిపడ్డాడు జితేంద్ర.

అప్పుడే చూశాడు వేగంగా నడచి వస్తున్న రజితని.

కారుముందునుంచే చకచకా నడుస్తూ తలవంచుకుని వెళ్తున్న రజితని చూసి 'రజితా!" అన్నాడు.

కారు దాటి వెళ్ళబోతున్న రజిత ఉలిక్కిపడి ఆగింది. "ఇక్కడున్నావా?" అంది.

"ఎక్కు!"

"అదేకదా థియేటర్!"

"లేదులే! కారు ఎక్కెయ్'

"ఎక్కడికి?"

"చెప్తాగా!"

ఓ క్షణం తటపటాయించి కారెక్కింది. వెంటనే బయలుదేరింది కారు. అయిదు నిమిషాలు పరిగెత్తి ఊరు బయట తోటవద్ద ఆగింది.


"ఎలమావితోట!"

"ఆం బ్రతుకే ఎలమావితోట మనకి!"

"ఊహూం నీకే"

"అదేం?"

"అదంతే! నువ్వు నిత్య వసంతుడివి!"




నవ్వేడు జితేంద్ర! కారు దిగేడు. అతని వెంటే కారు దిగింది ఆమె. మెల్లగా నడుస్తూ వెళ్ళి లోపలి బంగళాముందు ఆగేడు.

"జిన్, మీ నాన్న శేస్తున్నవాడు! రమేష్‌గారు రం అయితే నువ్వు జిన్. రం, జిన్ రెండూ యిచ్చేంత నిషానిని మీ పేర్లూ, యీ తోటా యిస్తాయి."

పకపక నవ్వేడు జితెన్. రజిత నడుం చుట్టూ చేయేసి ముందుకి నడుస్తూ "ఆ మాటకొస్తే నీ పేరు పెట్టిన మీ నాన్న దూరదృష్టిని మెచ్చుకోవాలి మనిద్దరి పేర్లూ మనకంటే ముందుగానే కలిశాయి!" అన్నాడు

షార్ప్‌గా నవ్వింది రజిత.

తర్వాత కబుర్లు ...పేకాట.....షటిల్ కాక్....మ్యూజిక్... పార్టీ.... మందూ.... గంటలు నిమిషాల్లా గడిచిపోయాయి.

వసంత రుతువులా కాలం గడిచాక దాదాపు రెండుగంటల వేళ దిగిన మత్తుతో, నిషాలో వాలిపోతున్న కళ్ళతో, సరికొత్త అనుభవం యిచ్చిన హాయితో తేలిపోతున్న శరీరంతో, గేట్లో దింపేసిన జితేంద్రకి టాటా చెప్పి తన గదికి వెళ్ళి పడుకుంది.

ఆమె రాకని ఎవరూ గమనించలేదు.

○ ○ ○

సరిగ్గా పై సంఘటన జరిగిన వారం రోజులకి హైద్రాబాద్ బేగంపేట విమానాశ్రయంలో బావని రిసీవ్ చేసుకుంది రజిత.

"హాయ్! ఎలా వున్నావ్?" మెరుస్తోన్న కళ్ళతో అడిగేడు శవన్. విమానంలో వెంట వచ్చిన మామకానీ, తండ్రికానీ అక్కడున్నారనే ధ్యాస కూడా లేకుండా రజిత భుజంపై ఓ చేయి, నడుం చుట్టూ మరో చేయి వేశాడు.

తెల్లటి శరీరం, మెరుస్తోన్న కళ్ళు, ఎత్తరితనం, నాగరికత నేర్పిన వాకింగ్ స్టయిల్ కొంచెంసేపు సమ్మోహితం చేసింది రజితని.

"ఫైన్!" అంది సింపిల్‌గా.

"వెరీ స్వీట్ వాయిస్!" అన్నాడు ఎడ్మైరింగ్‌గా.

"థాంక్స్!"

కారుదగ్గరికి వచ్చారు ఫార్మాలిటీస్ ముగించుకుని.

"నేరుగా మన వూరు వెళదాం!" అన్నాడు రావుగారు.

"నో! మామాజీ. ..నేను యిక్కడ రెండు రోజులు ఆగాలి. ఆ తర్వాతే మన వూరు. అంతగా మీకు అర్జంటయితే వెళ్ళండి....నేనూ రోజ్ రెండురోజులు యిక్కడ గడిపి వచ్చేస్తాం!"

"లేదులే! మేమూ వుంటాం యిక్కడే!" అన్నాడు అతని తండ్రి.

"అలా అయినా మీరో హోటల్లో దిగండి! నేనో హోటల్లో దిగుతా! రోజ్ నాకు కంపెనీ యిస్తుంది!"

రజిత మాటాళ్ళేదు.

"శరాన్! ఇది యిండియా — అమెరికా కాదు. అందునా తెలుగుదేశం! ఇక్కడ పెళ్ళికాని అమ్మాయి - ఎంత బావైనా-మరో మగాడితో తిరిగితే లోకం నలుగురూ నాలుగు మాటలంటారు. ఇక్కడ స్వాతంత్ర్యం వుంది! నాగరికత పెరిగింది! స్త్రీలు రాజకీయాల్లో ఉద్యోగాల్లో ప్రవేశించారు. బాగా చదువుకుంటున్నారు. అయినా యింకా యిలాంటి పట్టింపులు-ఆచారాలు మాత్రం పోలేదు!"

"రబ్బిష్!"

"నీ ఫారిన్ కళ్ళకి యిది రబ్బిషే! కాదన్ను. కానీ యిక్కడ అలా ప్రవర్తించటం రబ్బిష్" కొంచెం కఠినంగా అన్నాడు రావు.

"హుఁ కంట్రీ బ్రూట్స్, అయితే ఏం చేయాలి?" పెదాలు బిగించి బొమ్మలు ముడివేసి అతను ఆలోచిస్తూవుంటే ముద్దుగా కనిపించాడు రజితకి....అలా వాళ్ళిద్దరూ తన యిష్టానిష్టాలతో సంబంధం లేకుండా తనని గురించి మాటాడుతూవుంటే తమాషాగా అనిపించింది రజితకి.

ఒక్క క్షణం ఆగి అన్నాడు. "అంకుల్! ఇదో డైమండ్ రింగ్! ఇది రజిత చేతికి పెడుతున్నాను. ఇదే ఎంగేజ్‌మెంట్! అంటే మన దేశంలో నిశ్చితార్థం అనుకో! నేను రజితని పెళ్లి చేసుకుంటాను. దీనికి మీరంతా సాక్షి. ఇదో మినీ టేప్ రికార్డర్. ఇప్పుడు నేను చెప్పిన మాటలన్నీ రికార్డ్ చేసింది. ఇదీ ఓ సాక్ష్యం. ఇదో ఆటోమేటిక్ కెమెరా! మమ్మల్నిద్దర్నీ ఫొటో తీస్తుంది. ఇంకా ఫొటోలు తీసుకుంటాం. అవీ ఎవిడెన్స్!

ఇక్కడనుంచి రాగానే రిసెప్షన్ ఏర్పాటు చేయండి. అక్కడ మా పెళ్లి విషయం ఎనౌన్స్ చేయండి. తర్వాత ముహూర్తాలు చూసి పెళ్లి చేయండి. అఫ్‌కోర్స్! నాకు అలాంటి పెళ్ళిళ్ళపై నమ్మకం లేదు. నా ఉద్దేశ్యంలో సివిల్ మేరేజ్ చాలు. కానీ పెళ్ళంటే నా ఒక్కడి అభిప్రాయమే కాదుగా. మీ అందరి కోరికలూ తీరాలి. ఇకపోతే డౌరీ విషయం-

అది నువ్వూ మా డాడీ మాటాడుకోండి!

అమెరికానుంచి వచ్చినా డౌరీ అడుగుతున్నాను అనుకుంటున్నారా? వెలలేని పెళ్లికొడుకు విలువలేని పెళ్లికొడుకే! నువ్విస్తావు. డాడీ పుచ్చుకుంటాడు. ఇందులో తప్పేమిటి? నాకు బోధపట్టంలేదు. పీడిస్తే కదా బాధ! నో బార్గెయినింగ్! నో రేట్స్ బిజినెస్! నువ్వు ఫిగర్ చెప్పు. డాడీ ఓకే చేస్తారు—"

అంతే!

మాటలు ముగించి వెళ్లి టాక్సీలో ఎక్కారు యిద్దరూ.

"బావా! లక్షలకి విలువైన మాట అన్నాడు అల్లుడు! ఎంత డబ్బు పోస్తే యిలాంటి అల్లుడొస్తాడు నాకు! వాడిని అమెరికా పంపించి మంచిపని చేశాం మనం. నీ డబ్బూ నా పలుకుబడీ వ్యర్థం కాలేదు"

"థాంక్స్! బావా! బేరసారాలు మనకెందుకు. ఇచ్చేదేదో ముందుగానే వాడి ఎకౌంటుకి ట్రాన్స్‌ఫర్ చెయ్!"

"ఎంతయినా ముందు జాగ్రత్త కలవాడివిలే!"

"అందుకేగా సుపుత్రుడ్ని కన్నాను!"

"అందులో లేదు నీ గొప్పదనం! తగిన జోడీని కన్న మాద అసలైన గొప్పదనం!"

పకపక నవ్వుకున్నా రిద్దరూ.

కారు హోటల్ వేపుగా పరిగెత్తింది.

ం ం ం

విశాలమైన హోటల్ గది!

"అబ్బ! దాహం వేస్తుంది. ఐస్ వాటర్ తెప్పించావా."

"ఐస్ వాటరా? నో! నో! నైస్ వాటర్ యిస్తాను. ప్రయాణం చేసి నువ్వూ నేనూ అలసిపోయాం ఫారిన్ బీర్ తాగుదాం! చల్లబడ్తాయి శరీరాలు!" అని బాగ్‌లోంచి తీసి బీర్ యిచ్చాడు. రజిత బాటిల్ తెరిచి గ్లాసులో పోసి యిచ్చిందతనికి

"లేడీస్ ఫస్ట్!"

"నో థాంక్స్!"

"వై? ఇదేం తప్పుకాదు. హావ్ ఎ సిప్ మై డియర్ బేబీ!"

"బావా! నే నెవరను కుంటున్నావ్?"

"మై స్వీట్ హార్ట్!"

"కానీ నేను నిన్ను పెళ్ళి చేసుకోను!"

పక పక నవ్వేడతను "జోక్! జోక్! వండర్ ఫుల్ జోక్! ఏం నేను తగనా? విదేశాల్లో తాగి తిరిగి చెడిపోయానని అసహించుకుంటున్నావా? నో! నో! ఇటీజ్ వెరీ కామన్ టు అజ్!"

"లేదు నేనే చెడిపోయాను-"

"చెడిపోయావా? ఏమిటిది పూలిష్ నెస్! నువ్వేం పండువా? కాయవా? పాలా? పెరుగా? చెడి పోవటానికి డోంట్ టాక్ ట్రాష్!"

"అది కాదు బావా!"

"మరేమిటి?"

"నీకు షాకింగ్ న్యూసే! అయినా చెప్పక తప్పదు. యుసీ నేను జితేంద్ర ఫ్రెండ్సమి. అతను నన్ను లైక్ చేసేవాడు. నేనూ యిష్టపడ్డా నతని స్నేహాన్ని. ఓ రోజు యిలాగే యిద్దరం ఎంజాయ్ చేశాం డ్రింక్స్‌తో-తర్వాత యిద్దరం శారీరకంగా ఏకం అయ్యాం! తర్వాత పెళ్లి విషయమెత్తితే అఫూల్ నన్ను పురుగుని చూచినట్టు చూసి పెళ్ళి గిళ్ళి బుష్ హుక్! నేను నీ లాంటి వాళ్ళందరికీ తాళి కడుతూ వెడితే నూరు తులాల గోల్డ్ కావాలి. శుభ్రంగా మీ బావనో మరో గాడిదనో పెళ్ళి చేసుకో అని వెళ్ళిపోయాడు దాంతో నేను చాలా హర్ట్ అయ్యాను.


నువ్వు నే నంటే చాలా యిష్టపడుతున్నావ్ చిన్నపుడునుంచి. ఫారిన్ వెళ్ళాక కూడా పెళ్ళికి సుముఖంగా వున్నావు నేను నిన్నెలా మోసం చేయ గలను? అందుకే అందుకే జరిగింది చెపుతున్నాను."

శవన్ ఓ నిమిషం మాట్లాడలేదు. బీర్ బాటిల్ ఎత్తి కొంచెం గొంతులో పోసుకున్నాడు

"యు సీ మై ఫెయిర్ లేడీ! అదంతా ప్లీస్ ఫర్గెటిట్. పీడకల అనుకో-కల రావటంలో మన బాధ్యత వున్నా కలని చూసి జడుచుకోంగా? కలలో జడిసినా మెలకువ వచ్చాక కొంతసేపు మనస్సు పాడైనా తిరిగి అదంతా కల అని కొట్టేస్తాం కదా!

మై డియర్ ఎంప్రెస్! కిందికి చూస్తూ వుంటే మెళ్లో డైమండ్ నెక్లెస్ జారి మురికి కాలవలో పడింది! తిరిగి తీసుకోమా శుభ్రం చేసుకోమా?

మై డియర్ బెటర్ హాఫ్! అవన్నీ నీకు వింతగా వుండొచ్చు. ఇంతెందుకు - నువ్వు భారతదేశంలో పుట్టావు-ఈ దేశం ఎగ్జాంపిల్ చెప్తాను. నువ్వు పూజ చేస్తున్నావ్-అమ్మవారి విగ్రహం చేతిలోంచి జారిపడింది.




దాన్ని తిరిగి తీసుకుని కళ్ళకద్దుకని పూజా మందిరంలో భయంతో - భక్తితో-అలంకరించవూ-ఇదీ అంతే!

కాబట్టి పిచ్చి పిచ్చి ఆలోచనలు వద్దు. లెటజ్ ఎంజాయ్. అది చెల్లని రాత్రి! ఇది చల్లని రాత్రి!

దాన్ని మరచిపో!

ఇది పరువాల పంట!

దీన్ని మనసారా ఎంజాయ్ చెయ్! బ్రతుకంతా తీపి కలగా గుర్తుంచుకో.

పూర్ సెంటిమెంట్స్!

వీటిలో కొన్నిటిని ఎమెండ్ చేసుకోవాలి! తప్పదు.

తప్పు చేయటం వేరు. పొరపాటు చేయటం వేరు! దగా పడటం వేరు. ఈ క్లాసిఫికేషన్ జడ్జిమెంటుకి అవసరం!"

అతను చెప్పటం ఆపి ఆమె భుజంపై చేయివేసి దగ్గరిగా లాక్కుని తీయని దొండపండులాంటి ఎర్రని పెదాల్ని అందుకున్నాడు. గాఢంగా చుంబించాడు అయిదు నిమిషాలు ఊపిరి ఆళ్ళేదు రజిత !

"బావా!"

"ఊఁ"

"నువ్వు పురుషుడివి కావు!"

"వ్హాట్!"

"అవును-మీరు పురుషులు కారు!"

"ఆఁ"

"ఆఁ పురుషులు కారు! కారు! కారు!"

"మరి?" కంగారుగా అడిగాడ.

"రుషులు! మహా పురుషులు!"

అతనికి తన వ్యక్తిత్వం హిమాలయాల ఎత్తు పెరిగినట్లు అనిపించింది. ఆమెని ఎత్తుకుని ఆనందంతో గిర్రున తిరిగాడు. రజిత కిలకిల కోయిలలాగా నవ్వింది. అతనూ నవ్వు జత కలిపాడు. ఇద్దరి నవ్వులతో ఆ గది ఆ రాత్రి ప్రతిధ్వనించింది. జీవితమంతా నవ్వుల వానే అన్నట్టుగా! ✷